క్లుప్తంగా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టులు

కాశీబుగ్గ: అక్రిడేషన్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించడం గొప్ప పరిణామమని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. ఈ మేరకు పలాసలో మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, రూరల్ పరిధిలోని పాత్రికేయులు పాల్గొన్నారు.

అభయహస్తం లబ్ధిదారుల గుర్తింపు



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో 60 ఏళ్లు పూర్తయిన అభయహస్తం లబ్ధిదారులను గుర్తించాలని ఏపీఎం సనపల ప్రసాదరావు కోరారు. శనివారం మండల మహిళా సమాఖ్య భవనంలో వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభయహస్తం పెన్షన్ రాకుండా వేరే సామాజిక భద్రతా పెన్షన్ వస్తున్నప్పటికీ వారి అర్హతా ధ్రువపత్రాలు పరిశీలించిన తర్వాత అదనంగా రూ.500 వస్తుందన్నారు. జగనన్న తోడు రుణాలకు అర్హులను గుర్తించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

చైనాసాల్ట్ వినియోగించవద్దు



మాట్లాడుతున్న శేఖర్

కవిటి: ఉద్దానం ప్రాంతంలో కిడ్నీవ్యాధులు, హైబీపీ, షుగర తదితర వ్యాధులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్న ప్రస్తుత తరుణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు చైనా సాల్ట్, కలర్స్ వాడకాన్ని నిషేధించాలని కవిటిలోని ఉషోదయ షటిల్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. క్లబ్ ఆవరణలో శనివారం మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ అధ్యక్షతన ఫాస్ట్ ఫుడ్ షాపులు, టిఫిన్ హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. చైనాసాల్ట్, రీయూజ్డ్ ఆయిల్ వాడకంతో ఆరోగ్యం దెబ్బ తింటోందన్నారు. ఈ విషయంలో హోటల్ నిర్వాహకులు కచ్చిత నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

ఆర్బీకేల్లో ధాన్యం తేమశాతం పరీక్ష కిట్లు



తేమశాతం కిట్లతో వ్యవసాయ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించే కిట్లను అందుబాటులో ఉంచామని వ్యవసాయాధికారి తిలక్‌వర్మ తెలిపారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులకు కిట్లు అందజేశారు.

నేవీ అధికారి కుటుంబానికి పరామర్శ



నాగరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృపారాణి దంపతులు

మందస: పట్టణానికి చెందిన నేవీ అధికారి అంపోలు నాగరాజు ఇటీవల మరణించారు. ఆయన కుటుంబానికి కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, రామ్మోహనరావు దంపతులు శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తల్లిదండ్రులు రామానందం, పుష్పలతలను ఓదార్చారు. వారితో పాటు సత్యనారాయణ, నారాయణరావు, జోగారావు ఉన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల తొలి కార్తీక శనివారం సందర్భంగా బొడ్డభళీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆంధ్రా, ఒడిశా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం స్వామి వారికి మేల్కొలుపు అనంతరం వందలాది మంది భక్తులు వెంకటేశ్వరున్ని దర్శించుకున్నారు. రంగాల బాలరాజు, జయమ్మ దంపతులు అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు చల్ల కృష్ణారెడ్డి, లండ పితరంబర్, కృష్ణలు ఏర్పాట్లు చేశారు.

సామాజిక సాధికార యాత్రకు సిద్ధం

- నేడు పలాస–కాశీబుగ్గలో బహిరంగ సభ, బస్సుయాత్ర
- విజయవంతం చేయాలని నాయకుల పిలుపు



టెక్కలిలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, సమన్వయకర్త దువ్వాడ వాణి



కాశీబుగ్గ: బస్సుయాత్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, నాయకులు



వైఎస్సార్ విగ్రహం వద్ద పనులు పర్యవేక్షిస్తున్న నాయకులు డబ్బీరు భవానీశంకర్, పి.వి.సతీష్

కాశీబుగ్గ: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు సర్వం సిద్ధమైంది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం జరగనున్న యాత్రకు ముందస్తుగా జంట పట్టణాలలో సందడి వాతావరణం కనిపించింది. రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి, పలాస ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు పర్యవేక్షణలో పార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్టేజీతో పాటు ఎక్కడికక్కడ భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. కాశీబుగ్గ సంత మైదానంలో దివంగత వైఎస్సార్ విగ్రహానికి తుది మెరుగులు దిద్దారు. వైఎస్సార్ సీపీ నాయకులు డబ్బీరు భవానీశంకర్, పి.వి.సతీష్ తదితరులు పర్యవేక్షించారు.



సూదికొండలో ప్రచారం నిర్వహిస్తున్న శిష్టు గోపి

కాశీబుగ్గ: కాశీబుగ్గ కేటీ రోడ్డులో మంత్రి అప్పలరాజు ఆధ్వర్యంలో జరగనున్న పలాస నియోజకవర్గ సామాజిక సాధికార బస్సు యాత్ర, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మున్సిపాలిటీ పరిధిలో పలు వీధుల్లో పర్యటించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సమాజంలో ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సీఎంకు మద్దతు ప్రకటించడానికి బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని 19వ వార్డు ప్రజలకు పిలుపునిచ్చారు.

వజ్రపుకొత్తూరు: పలాస– కాశీబుగ్గలో జరిగే సామాజిక సాధికార యాత్రకు పెద్ద ఎత్తున తరలిరావాలని వజ్రపుకొత్తూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

స్వాగతానికి పెద్ద ఎత్తున తరలిరావాలి...

టెక్కలి: పలాసలో ఆదివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర సభా కార్యక్రమానికి సంబంధించి టెక్కలి నుంచి ఆరంభం కానున్న బస్సు యాత్రకు స్వాగతం పలికేందుకు కార్యకర్తలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణితో కలిసి బస్సు యాత్ర ఆరంభం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు బస్సు యాత్ర టెక్కలి చేరుకుంటుందని, అనంతరం ఎస్ కన్వెన్షన్ హాల్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు పలాస చేరుకుంటుందని వివరించారు. ఉదయం 9 గంటలకు కార్యకర్తలంతా టెక్కలి చేరుకుని బైక్ ర్యాలీతో స్వాగతం పలకాలని వాణి కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.హరి, నాయకులు జి.మోహన్‌రెడ్డి, కె.కామేష్, ఎం.శంకర్, జి.అప్పలరెడ్డి, పి.ఫల్గుణరావు, జె.జయరాం, బి.రామకృష్ణ, టి.ధర్మారావు, జె.తిరుమలరెడ్డి, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకుడు జగన్నాయకులు



మందస: భేతాళపురంలో వైఎస్సార్, జుత్తు విగ్రహాల వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మందస: సామాన్య కుటుంబంలో జన్మించి ఎమ్మెల్యేగా ఎదిగిన జుత్తు జగన్నాయకులు మంచి రాజకీయవేత్తని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు దివంగత జుత్తు జగన్నాయకులు వర్ధంతి శనివారం బిడిమిలోని జుత్తు జగన్నాయకులు ఘాట్, హరిపురం, నారాయణపురం జంక్షన్, భేతాళపురంలలో జగన్నాయకులు విగ్రహాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల కష్టాలను తెలుసుకుని, వారి అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు జగన్నాయకులు అని కొనియాడారు. కార్యక్రమంలో బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాద్ర డిల్లేశ్వరరావు, డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యూ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు మడియా రామకృష్ణ, పార్టీ నాయకులు పసుపురెడ్డి రాము, గొరకల కేశవరరావు, దున్న హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కె.కపాసుకుద్దిలో అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో దివంగత ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సంఘం నేత పులకల శ్రీరాములు జగన్నాయకులు చిత్రపటానికి పూలమాలవేసి సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ దువ్వాడ పుట్టిన రోజు వేడుకలు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పలాస నాయకులు

కాశీబుగ్గ/టెక్కలి : ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నేత దువ్వాడ శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలు శనివారం టెక్కలిలో ఘనంగా జరిగాయి. అక్కవరం సమీపంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో జిల్లాతో పాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, అధికారులు పెద్ద ఎత్తున చేరుకుని హాజరై దువ్వాడకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జెమ్స్ ఆసుపత్రి నేతృత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్థానిక అభయం యువజన సేవా సంఘం ద్వారా నిరుపేదలకు అన్నదానం చేశారు. జబర్దస్త్ బృందం నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. పలాస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు కూన హేమాచలం, సత్తారు తేజేశ్వరరావు, దయిల సెసుందర, కొవ్వూరు సంతోష్, దువ్వాడ నవీన్‌కుమార్, చాపర వినోద్‌కుమార్, కంచరాన జగన్ తదితరులు ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న సమన్వయకర్త పిరియా సాయిరాజ్. చిత్రంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

సోంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రచారంలో సోషల్ మీడియా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు.

సోంపేట పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో సోషల్ మీడియా ప్రతినిధులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్సీ నర్తురామారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సోషల్ మీడియాది కీలకపాత్ర అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు సోషల్ మీడియా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కంచిలి, ఇచ్ఛాపురం ఎంపీపీలు పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, పార్టీ నాయకులు నర్తు నరేంద్ర, గుమ్మిడి రాందాస్, కడియాల ప్రకాష్, ఆశి పురుషోత్తం రెడ్డి, బతకల మోహనరావు, ఉలాల భారతీ దివ్య, ప్రకాశరావు పటాన్నాయక్, కొనపల సురేష్, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ ధనంజయమజ్జి

కవిటి: మండల కేంద్రం కవిటిలో జెడ్పీ ఒడియా ఉన్నత పాఠశాల, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహిం చారు. దివంగత భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పొల్లాయి దూర్వాసులు జ్ఞాపకార్థం పికోందరావు ఆర్థిక సాయంతో పోటీలు నిర్వహించినట్టు పొల్లాయి లక్ష్మణమూర్తి, తెప్పల రవి తెలిపారు. విజేతలకు ఎంఈఓ ధనంజయ మజ్జి, ఒడియా పాఠశాల హెచ్‌ఎం లింగరాజ్ పట్నాయక్ బహుమతులు అందించారు.

ఆర్మీ జవాన్ మృతితో విషాదఛాయలు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



బత్సల బాపూజీ(ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దాన గోపినాథపురం పంచాయతీ మెళియాపుట్టి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బత్సల బాపూజీ(29) గుండెపోటుతో మృతి చెందారు. దసరా సెలవులకు స్వగ్రామానికి వచ్చిన బాపూజీ శనివారం అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈయనకు ఐదేళ్ల క్రితం ఆర్మీలో సిగ్నల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. కాగా, ఆర్మీ జవాన్ అంత్యక్రియలు పోలీసులు అధికార లాంఛనాలతో నిర్వహించారు.

అర్హులందరికీ ఓటు హక్కు తప్పనిసరి



ఓటరు నమోదు కేంద్రం పరిశీలిస్తున్న కోటబొమ్మాళి తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ

ఇచ్ఛాపురం రూరల్: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని, ప్రతి పోలింగ్ స్టేషన్లో ఓటర్ల జాబితాను రెండు రోజుల పాటు ప్రదర్శించాలని తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కొఠారీ, తులసిగాం, ధర్మపురం పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు.

వజ్రపుకొత్తూరు రూరల్: 18 ఏళ్ల నిండిన యువతి, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తులు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ బి.అప్పలస్వామి కోరారు. శనివారం వజ్రపుకొత్తూరు, డోకులపాడు, బాతుపురం, కిడిగింగి గ్రామాల్లో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో డిటీ గిరిరాజ్, రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోటబొమ్మాళి: ప్రకాష్‌నగర్ కాలనీలోని 307 నంబరు ఓటరు నమోదు కేంద్రాన్ని తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ పరిశీలించారు. బీఎల్‌ఓ రమణమ్మకు పలు సూచనలు చేశారు. సీఎస్‌డీటీ కె.రాము పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో దిమిలాడ విద్యార్థి ప్రతిభ



అవార్డు అందుకుంటున్న లిఖిల్‌మణికంఠ

మందస: రాష్ట్రస్థాయి(తెలంగాణా, ఆంధ్రప్రదేశ్)లో జరిగిన తెలుగు, హిందీ ప్రతిభా పోటీల్లో నందిగాం మండలం దిమిలాడ గ్రామానికి చెందిన చమళ్ల లిఖిల్‌మణికంత ప్రతిభ కనబరిచింది. మన సంస్కృతి 2023–24 పేరిట ఆంధ్రప్రదేశ్–తెలంగాణా రాష్ట్రాల పరిధిలో జరిగిన ఈ పోటీల్లో ద్వితీయ ర్యాంకును సాధించింది. మణికంత టెక్కలిలోని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. లిఖిల్ మణికంఠను స్థానికులు శనివారం అభినందించారు.

ఉత్సాహంగా గ్రిగ్స్ పోటీలు



ఇచ్ఛాపురంకబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జోన్ స్థాయి గ్రిగ్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వాలీబాల్ సీనియర్ విభాగం(బాలురు), ఖోఖో సీనియర్ విభాగం(బాలురు)లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. పోటీలను ఎంఈఓలు దాశరథి, బి.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు అప్పలస్వామి, చంద్రశేఖర్, పైల గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని సురంగి రాజా క్రీడా మైదానంలో శనివారం పాఠశాల గ్రిగ్స్ కీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పీటీ, జోనల్ ఇన్‌చార్జి కె.పద్మనాభం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల నుంచి 405 మంది పాల్గొని సత్తాచాటారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ దాశరథి

జావెలిన్‌త్రోలో పలాస యువకుడి ప్రతిభ



యుగంధర్‌కు అభినందిస్తున్న దానేటి పద్మజ

కాశీబుగ్గ: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి జావెలిన్‌త్రో పోటీల్లో పలాసకు చెందిన కె.యుగంధర్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాను చదువుకున్న సూర్యతేజ కళాశాలలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు దానేటి పద్మజ, కరస్పాండెంట్ దానేటి కామేశ్వరరావులు క్రీడాకారున్ని అభినందించారు.

తలసేమియా చిన్నారికి సాయం



తనీష్‌కు సాయమందిస్తున్న రామకృష్ణ

మందస: మండలంలో రాంపురం గ్రామానికి చెందిన నాలుగేళ్ల తనీష్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అగ్నికుల క్షత్రియ చారిటబుల్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడు మడియా రామకృష్ణ చేతుల మీదుగా శనివారం తనీష్‌కు రూ.5వేలను హరిపురంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాద్ర డిల్లేశ్వరరావు, బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ, జుత్తు పాపారావు, నారాయణ, అడతాల మనోజ్, బుజ్జి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం



వజ్రపుకొత్తూరు: దేవునల్తాడలో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



కంచిలి: మఠంసరియాపల్లి వద్ద పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ జగన్మోహనరావు

వజ్రపుకొత్తూరు: మండలంలో ఖరీఫ్ వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రతి రైతుకూ ప్రభుత్వం న్యాయం చేస్తుందని పలాస వ్యవసాయ శాఖ ఏడీ ఎల్.వి.మధు అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు మండలం పూండి– గోవిందపురం, సుంకర జగన్నాథపురం, పొల్లాడ, కొమరల్తాడ, దేవునల్తాడ ప్రాంతాల్లో రైతులతో కలిసి వ్యవసాయ శాఖ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని చెప్పారు. మండలంలో 6100 ఎకరాల్లో వరి సాగు చేయగా దాదాపు 2 వేల ఎకరాల్లో పంటకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వర్షాభావ పరిస్థితులు, వంశధార కాలువ నుంచి సాగునీరు అందక పోవడంతో మెట్టు ప్రాంత భూములు పూర్తిగా ఎండిపోయి పొట్ట, కంకుల దశలోనే నష్టం జరిగిందన్నారు. అంచనాలను పూర్తి స్థాయిలో రూపొందించి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి, ఏఈఓ ఎం.జ్యోత్స్న, సైనూరు సర్పంచ్ అట్టాడ గోవిందరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరవు పరిస్థితులపై ఆరా..

కంచిలి: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏర్పడిన కరువు పరిస్థితులను వ్యవసాయశాఖ సోంపేట సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు కె.జగన్‌మోహన్‌రావు శనివారం పరిశీలించారు. మఠం సరియాపల్లి, కొల్లూరు తదితర గ్రామాల్లో ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. కరువు పరిస్థితిని ఇప్పటికే వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులకు నివేదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.ధనుంజయ, వీఏఏలు పాల్గొన్నారు.

కులగణనతో బీసీలకు ప్రయోజనం

కంచిలి: కులగణన చేపట్టేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలియజేసిన నేపథ్యంలో బీసీ కులాల్లో అణగారిన, అల్పసంఖ్యాకులు, కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర సగర కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజ్జెల మాధవరావు పేర్కొన్నారు.

ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సగర(ఉప్పర) కులం బీసీ–డీలో 31వ సంఖ్యలో ఉందని, ఒడిశా రాష్ట్రంలో ఎస్టీ జాబితాలో ఉందని గుర్తుచేశారు. కులగణన వల్ల తమలాంటి అల్పసంఖ్యాక వర్గానికి సంజీవనిలా ఉపయోగపడుతుందన్నారు.